# 4. చెట్టు కొట్టేశారు

రామయ్యగారు ఇబ్బందిలో పడ్డారు.

ఈ మధ్య రెండు నెలల కింద, ఉన్న ఒక్క కొడుకుకి వివాహం చేశారు. శంకరరావు టౌన్లో కాలేజీలో లెక్చరరుగా పని చేస్తున్నారు. అందంగా ఉంటాడు. అమ్మాయి ఇందిర పట్టింటి నుండి వచ్చింది. ఆమె ఎమ్.ఏ. పాసయింది. తండ్రి విశ్వవిద్యాలయంలో రీడరు.

కాని, ఆమె పెళ్లి తరువాత అత్తవారింటికి గృహప్రవేశానికి వచ్చి ఒక రాత్రి కూడా అక్కడ గడపలేదు. అత్తవారి ఇంట్లో ఏ మరుగూ లేదు. ఆధునికమైన సౌకర్యాలు లేవు. పెరట్లో నూతి దగ్గర స్నానం చేయాలి. ఆవరణ గోడలు కూడా ఎత్తు లేవు. ఆ ఇంట్లో ఒక్కరాత్రి కూడా తాను ఉండలేనని కొత్తకోడలు చెప్పింది. ఏదైనా అన్ని సౌకర్యాలూ ఉన్న ఇల్లు దొరికితే మారిపోదామంది.

రామయ్యగారు కోడలు చెప్పినవన్నీ సావధానంగా విన్నారు. ఆయన ముప్పై అయిదు సంవత్సరాలు టీచరుగా పని చేసి పదేళ్లకింద రిటైరయ్యారు. ఉద్యోగంలో నాలుగురాళ్లు వెనకవేసి తనకు నచ్చిన రీతిగా మొక్కల కోసం ముందూ వెనకా జాగా విడిచిపెట్టి, దళసరి ఇటుకగోడలతో డాబా ఇల్లు కట్టించారు. ప్రశాంతంగా మొక్కల మధ్య, పొదుల మధ్య కాలం గడుపుతున్నారు. ఆయన తను ఇల్లు వదలి మరొకచోటికి వెళ్లలేనన్నారు.

మరో ఇంటికి మారేవరకు, లేకపోతే వేరే ఏర్పాటు జరిగేవరకు ఆమె ఆ ఇంట్లో ఉండలేనంది. శంకరరావు ఆమె దగ్గరికి ఎప్పుడు వీలయితే వచ్చి ఉండవచ్చునంది. అతనికి అత్తవారి ఇంట్లో అన్ని సౌకర్యాలు జరుగుతాయి.

శంకరరావుకి ఏమీ పాలుపోలేదు. తాత్కాలికంగా భార్య సలహాను అంగీకరించాడు. అతనికి తండ్రి అంటే గౌరవం, భక్తి ఉన్నాయి. తల్లి అంటే ప్రాణం. అతడు వాళ్లను విడిచి వెళ్లలేడు.

రామయ్యగారు కట్టించినది డాబా ఇల్లు. విశాలమైన డాబా మీద పెద్ద గది వస్తుందని, దానిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవచ్చునని బంధువులలో ఒకరు సూచించారు. కాని, రామయ్యగారి దగ్గర అంత డబ్బులేదు.

ఆపద్బాంధవుడి వలె అతని వియ్యంకుడు ముందుకు వచ్చాడు. "బావగారూ! డాబామీద విశాలమైన పడకగది కట్టించాలని మీరు అనుకుంటున్నారని నేను విన్నాను. చాలా సంతోషిస్తున్నాను, మీకో విషయం చెప్తున్నాను. రెండు సంవత్సరాలకింద మా ఇందిర పెళ్లికి కట్నం అవసరమో అని, ఒక లక్ష రూపాయలు బ్యాంకులో వేశాను. మీరు ఉత్తములు, కట్నం కింద ఏమీ తీసుకోలేదు. ఆ డబ్బు రేపే మీకు తెచ్చి ఇస్తాను. మరే

ఆలోచన లేకుండా దీన్ని వినియోగించండి."

రామయ్య గారి కన్నా శంకరరావు చాలా సంతోషించాడు. మేడమీద గది వేయించడానికి పెద్దాయన కొడుకుకి బాధ్యత అప్పగించారు.

శంకరరావు మరే ఆలస్యం చేయకుండా మరునాడే ప్లానులు వేయించాడు. ఎస్టిమేటు తయారు చేయించాడు. టౌను ప్లానింగు ఆఫీసు నుండి అవి ఆమోదముద్ర పొందివచ్చాయి.

పైన గది కట్టడానికి సుముహూర్తం కూడా నిశ్చయించారు. ముహూర్తానికి పది రోజులు ముందు రామయ్యగారు ప్లాను చూపి, పక్కనున్న కొడుకునీ కంట్రాక్టరునీ ప్రశ్న వేశారు. దాబాకి మెట్లు ఇంటితోనే కట్టించి ఉండవలసింది. డబ్బు సర్దుబాటుకాక పిట్టగోడ, మెట్లు విడిచిపెట్టాను. ఇప్పుడు అవసరం పడింది. మెట్లు మొదలుపెట్టే చోట వేపచెట్టుంది కదా, దాని సంగతి ఏం చేశారు?" అని.

శంకరరావు కంట్రాక్టరువేపు చూశాడు.

"సాధారణంగా అడ్డు వచ్చిన చెట్టు చిన్నదైతే మరొక చోటికి మార్చుతారు. చెట్టు పెద్దదైతే కొట్టేస్తారు. మీ వేప చెట్టు చాలా పెద్దది. దానిని వేరొకచోటికి మార్చే ప్రశ్న లేదు. వాస్తుశాస్త్రం ప్రకారం చెట్టు ఉన్న చోటి నుంచే మేడకి మెట్లు కట్టాలి. ఇంతవరకు మీరు మెట్లు కట్టించలేదు. అప్పుడు కట్టకతప్పదు" అన్నాడు కంట్రాక్టరు.

"అయితే చెట్టు కొట్టేస్తారా?"

అయ్యగారు కంట్రాక్టరుని అడిగారు.

"గత్యంతరం లేదు" అన్నాడతడు.

ఈ మాట వినగానే ఆయనకు కళ్ల నిండా నీళ్లు తిరిగాయి.

వేపచెట్టంటే రామయ్యగారికి ప్రాణం.

ఆది ఇంటితో కూడా లేచింది. ఏపుగా పెరిగింది. దాని కాండమే నాలుగడుగులు వ్యాసముంటుంది. రామయ్యగారు దంతధావనానికి ఆ చెట్టు పుల్లలే ఉపయోగిస్తారు. లేత చివుళ్లు ఉదయమే పరగడుపు ఉప్పుతో నములుతారు. వేప పళ్ల గింజలు ఆయన భార్య పులుసులో వేస్తారు. బియ్యంలో పురుగులు చేరకుండా వేపాకులు వేస్తారు. చెట్టు నాలుగు పక్కలకూ వ్యాపించి చల్లటినీడ ఇస్తున్నది.

శాంతికీ, సౌభాగ్యానికీ చెట్టు ప్రతీక. పచ్చని చెట్టుని కొట్టించడానికి ఆయన చాలా మథనపడ్డారు. ఏం చేయడం?

సిమెంటు బస్తాలు, ఇటుకలు మొదలైనవి వచ్చిపడ్డాయి. చెట్టును కొట్టడానికి అయిదు రోజులు, రెండురోజుల తరువాత నిర్మాణం ప్రారంభించే సుముహూర్తం.

...అందుకే ఆయన మతిపోయినట్లున్నారు.

చెట్టు కొట్టడం మరునాడే ప్రారంభమైంది.

అనుకున్న ప్రకారం దాన్ని అయిదురోజుల్లో కొట్టలేకపోయారు. మరో మూడు రోజులు పట్టింది. భూమిలో ఉన్న కాండాన్నీ, వేళ్లనూ కొట్టడానికి మరో అయిదు రోజులు పట్టింది. తరువాత ఆరడగుల గొయ్యి తయారైంది.

ఈ లోగా మంచి ముహూర్తం దాటిపోయింది. ఎక్కడ పని అక్కడ ఆగిపోయింది. మరో రెండు నెలల వరకు మూఢం. పనివాళ్లు వెళ్లిపోయారు.

వీధి ఆవరణలో చెట్టుకొమ్మలు, పేళ్లూ, వేళ్లూ అన్నీ చిందరవందరగా పడివుంటే, రామయ్యగారు ఇద్దరు పనివాళ్లను బెత్తాయించి కలపనంతా ఆవరణ గోడ పక్కకు పేర్పించారు.

ఆ సంవత్సరం వారం రోజులు ముందుగానే ఋతుపవనాలు దేశంలోకి ప్రవేశించాయి. చలితోనూ, జల్లులతోనూ మొదలై క్రమంగా పెద్ద వర్షాలు పడ్డాయి.

శంకరరావు వీలు దొరికినప్పుడల్లా అత్తవారింటికి వెళ్తున్నాడు.

వీధి గది శంకరావుది. అందులో టేబిలు కుర్చీ ఒక పక్కకు పెట్టి, వాటి జాగాలో సిమెంటు బస్తాలు, అడుగున బల్లలు వేసి పేర్చారు. పైన టార్పాలిన్ కప్పారు.

ఆ రోజు శనివారం. కాలేజీలో పనిలేకపోతే శంకరరావు అత్తవారింటికి వెళ్లిపోయాడు.

మధ్యాహ్నం మూడు గంటల తరువాత పెద్దగాలితో వర్షం వచ్చింది. తెరచివున్న వీధి తలుపు వేయడం చాలా కష్టమైంది. సిమెంటు బస్తాల మీద కప్పిన టార్పాలిన్ ఎగిరిపోయింది. దాన్ని తిరిగి కప్పేసరికి రామయ్యగారు పూర్తిగా తడిసిపోయారు.

రాత్రి ఆయనకు బాగా జలుబు చేసింది. మరునాటి ఉదయానికి జ్వరం వచ్చింది. రెండు రోజుల తరువాత అత్తవారి ఇంటి నుండి శంకరరావు తిరిగివచ్చేసరికి రామయ్యగారు విపరీతమైన జ్వరంతో పడి ఉన్నారు.

ఇంటి డాక్టరును శంకరరావు తీసుకువచ్చాడు. ఆయన చాలాసేపు రోగిని పరీక్షచేసి శంకరరావుని పైకి పిలిచి అన్నారు.

“మీ నాన్నగారికి ఇంట్లో సదుపాయంగా ఉండదు. న్యుమోనియా వచ్చింది. ఏ నర్సింగ్‌హోమ్‌లోనేనా చేర్చు. అశ్రద్ధ చెయ్యకు.”

కాని, రామయ్యగారు నర్సింగ్‌హోముకి వెళ్లడానికి నిరాకరించారు. ఇంట్లోనే ఉండి చికిత్స చేయించుకుంటామని అన్నారు.

మరో మూడురోజుల తరువాత రామయ్యగారు పరమపదించారు.

శంకరరావు చిన్నపిల్లాడికన్నా హెచ్చుగా ఏడ్చాడు.

బంధువులూ, స్నేహితులూ వచ్చారు. దహనసంస్కారాల కోసం ప్రయత్నం చేస్తున్నారు. శ్మశానంలో చితికి కర్రలు తెప్పించాలన్నారు.

వచ్చిన వాళ్లలో ఒకాయన అన్నాడు."ఒరే శంకరం! కర్రలు ఎంతవుతాయో తెలుసా? వెయ్యి రూపాయలు. చెట్టు కొట్టిన చెక్కలు ఎదురుగా ఉన్నాయి. రెండు బళ్ల కర్రలవుతాయి. ఏ కర్ర అయినా డబ్బాడు కిరసనాయిలు పోసి ముట్టిస్తే దివ్యంగా కాలుతుంది."

చెక్కలు శ్మశానానికి పంపించారు.

చితిని పేర్చి అన్నీ సిద్ధం చేశారు. డబ్బాకు బదులు రెండు డబ్బాల కిరసనాయిలు పోశారు. తరువాత శంకరరావు నిప్పు పెట్టాడు.

కిరసనాయిలు పోయడం వల్ల ముందుగా పెద్ద మంటలు పైకి లేచాయి. క్రమంగా మంటలు ఆరిపోయాయి. చిక్కటి పొగ - ఘాటైన పొగ - కటువైన పొగ కమ్ముకుంది.

చిన్నగాలి రివట వేసింది. దట్టమైన పొగ దగ్గరగా ఉన్న వాళ్లను చుట్టుకుంది. శంకరరావు, మరో ఇద్దరు ఆ ఘాటు భరించలేక ముఖాలు తిరిగి పడిపోయారు. దగ్గరలోనే ఉన్నవాళ్లు పడిపోయిన వాళ్లని దూరానికి లాక్కుపోయారు.

చెట్టుకొట్టించిన వాళ్ల మీదా, చెట్టు కొట్టిన వాళ్ల మీదా రామయ్యగారి ఆగ్రహం ఘాటైన పొగ రూపంలో ఆకాశం వైపు సుళ్లు తిరిగింది.